# అన్వేషణ

గుంటూరు
20-2-'80

డియర్ వికాస్‌గారూ!

మీ సమాధానం కోసం కొన్ని యుగాలుగా కళ్ళు కాయలు కాచేట్టుగా ఎదురుచూసీ చూసీ ఇక రాదనుకుంటున్న క్షణాల్లో బీటలు వారిపోతున్న నా హృదయంమీద పన్నీటి జల్లును చిలకరించినట్లుగా మీ ఉత్తరం...

ఆలస్యంగా రాసినా ఎంత అందమైన, ఎంత ఆత్మీయమైన ఉత్తరం రాశారండి! మీ నుండి ప్రతిరోజూ ఇలాంటి ఒక్క ఉత్తరాన్ని అందుకోగల్గితే ఈ జన్మలో ఇంకేమీ కోరుకునేదాన్ని కాదు. మీ ప్రతి ఉత్తరం నాకొక అద్భుతమైన, అపూర్వమైన అనుభూతినిస్తుంది. నవలల్నేకాదు, ఉత్తరాల్ని కూడా ఇంత అందంగా రాయటం ఎలా నేర్చుకున్నారండి మీరు. నేర్చుకోవటంవల్ల రాదనుకుంటాను - యూ ఆర్ ఎ బోర్న్ రైటర్.

మీరెప్పుడూ ఉత్తరాలు ఆలస్యంగానే రాస్తారండి! ''ఎక్స్‌ట్రీమ్లీ సారీ గీతా!'' అంటూ తప్ప మీ ఉత్తరమెప్పుడూ మరో వాక్యంతో ప్రారంభం కాదు. ఎప్పుడూ ఏవేవో పనులతో సతమతమైపోతున్నానని రాస్తుంటారు. ఏమిటి బాబూ మీ పనులు? రచయితలు సాధారణంగా ''బద్ధకిస్టులని'' చెప్పుకొంటారు మీరూ అంతేనని ఒప్పుకోక యేవేవో పనులున్నాయని ఎందుకండి అబద్ధాలాడ్తారు!

మీ ప్రతి ఉత్తరంలోనూ ఒకసారి మీ గుంటూరు కొచ్చి నిన్ను కలుసుకుంటాను అని రాస్తారు. ఇది మరో పెద్ద అబద్ధం! మొదట్లో మీ మాటలు నమ్మి మీరు నిజంగానే వస్తారని మీ కోసం ఎదురుచూసి చూసి ఇక ఓపిక లేక మానేశాను. ఆ మధ్య మీరు యేదో రచయితల కాన్ఫరెన్స్ అటెండ్ చెయ్యటానికి ఫలానా తేదీనాడు వస్తున్నానని, ఆ కాన్ఫరెన్స్ జరుగుతున్న హాల్ దగ్గరకొచ్చి నన్ను కలుసుకోమని రాస్తే మా ఫ్రెండ్స్ అందరికీ ప్రఖ్యాత రచయిత వికాస్‌గారు నన్ను కలుసుకోవడానికి గుంటూరు కొస్తున్నారని గర్వంగా చెప్పుకొన్నాను. మా ఫ్రెండ్స్‌లో మీ అభిమానులు చాలామందే ఉన్నారు. వాళ్ళంతా వికాస్ గారొచ్చినప్పుడు మమ్మల్ని కాస్త ఆయనకు పరిచయం చెయ్యవే అని ఎంతో బతిమాలారు. వాళ్లతో చాలాసేపు అలా బతిమాలించుకుని 'అలాగే చేస్తాలెండర్రా' అని వాగ్దానం

చేసేశాను. మీరు నాకు రెండు మూడేళ్ళుగా రెగ్యులర్‌గా ఉత్తరాలు రాస్తున్నారని మీకున్న అసంఖ్యాకమైన అభిమానుల్లో నేనంటే మీ హృదయంలో ఒక ప్రత్యేక స్థానముందని మా ఫ్రెండ్సందరూ నన్నెంతో గొప్పగా చూస్తారు. (కొందరు ఈర్ష్యతో గింజుకుంటారు కూడా నండోయ్) కానీ యేం లాభం! మీరు నా ఫ్రెండ్స్ దృష్టిలో నన్ను చాలా చులకన చేసేశారు. మీరారోజు రానే లేదు. ఆ కాన్ఫరెన్స్ జరిగే చోటికి నేనూ మా ఫ్రెండ్సము అందరమూ కలిసి వెళ్లాం - మీరు రాలేదని చెప్పగానే నేనెంతగా కృంగిపోయానో తెలుసా? నా కళ్ళల్లో ఉబికివస్తున్న కన్నీళ్ళను ఆపుకోలేకపోయాను. ఆ క్షణంనుండి మా ఫ్రెండ్స్ ఎదుట నేను మొఖం ఎత్తుకోలేకపోయాను. వారం రోజులదాకా నేను కాలేజీక్కూడా వెళ్లలేదు తెలుసా? మీకొక ప్రత్యేకమైన విన్నపం మహాశయా! మాలాంటి అమాయక హృదయాల్లో ఇలా ఆశలు సృష్టించి వాటిని నిర్ధాక్షిణ్యంగా హతమార్చకండి బాబూ! మీకు పుణ్యముంటుంది.

మీకసలు మళ్ళీ ఈ జన్మలో ఉత్తరం రాయకూడదనుకున్నాను. కాని మొన్నటి మీ ఉత్తరం, తర్వాత 'స్వాతిలో' వచ్చిన కొత్త నవల చదివాక మీకీ ఉత్తరం రాయకుండా ఉండలేకపోతున్నాను. మీ కొత్త నవల 'దీపం' నిజంగా నాకు ఎంతో నచ్చిందండి - యువతీ యువకుల మనస్సుల్లోని మారుమూలల్ని ఇంత అద్భుతంగా శోధించే నేర్పు మీలోనే చూశాను. ఒక్కొక్కసారి మీరు గొప్ప సైకాలజిస్టులా కనిపిస్తారు... మీ పాత్రల ఫీలింగ్స్‌ని చదువుతోంటే ఇదంతా నాగురించే రాశారా అనిపిస్తుంటుంది! అందుకే మీ నవలలు చదువుతున్నంతసేపు మీ నవలల్లోని పాత్రలతో, సంఘటనలతో ఒక అద్భుతమైన తాదాత్మ్యాన్ని పొందుతాను - హేట్సాఫ్ టు యూ సర్! యూ ఆర్ రియల్లీ గ్రేట్!

ఈ ఉత్తరానికైనా వెంటనే సమాధానం రాస్తారా? కొన్నిసార్లు మీరు పనుల తొందర్లో ఉన్నానని రెండు ముక్కలు పొడి పొడిగా రాసి పడేస్తారు - అలాంటి ఉత్తరాలు నాకు అస్సలు నచ్చవండి - మొన్న రాశారే... మీరెప్పుడూ నాకు అలాంటి ఉత్తరాలే రాయాలి. పొడిపొడిగా నాల్గు వాక్యాలు రాసిపడేస్తే నేను అస్సలూరుకోను - తెలిసిందా? కనీసం నాల్గు పేజీలకు తగ్గకుండా రాయాలి - యేమంటారు?

ఇక ఉంటాను బాబూ! ఇప్పటికే మిమ్మల్ని బాగానే బోర్ కొట్టినట్టున్నాను.

యువర్స్ మోస్ట్ ఫ్రెండ్లీ

గీత

ఆ ఉత్తరం చదవటం పూర్తిచేసి గాఢంగా నిట్టూర్చాను - పూర్ గీతా! వస్తానని చెప్పి ఆమెను బాగా డిజప్పాయింట్ చేశాను. మరోసారి అలాంటి పొరపాటు చెయ్యకూడదు -

రచయితగా నేను యే ఆస్తిపాస్తులు సంపాదించలేకపోయినా గీతలాంటి వాళ్ళ అవ్యాజమైన అభిమానాన్ని సంపాదించినందుకు గర్విస్తుంటాను.

పోస్టులో ప్రతిరోజూ నాకిలాంటి ఉత్తరాలు వస్తూనే వుంటాయి. ఆలస్యంగానైనా అందరికీ సమాధానాలు తప్పనిసరిగా రాస్తూనే ఉంటాను.

నాకు ఉత్తరాలు రాసే వాళ్లల్లో ఆడవాళ్ళు మగవాళ్ళు, కాలేజీల్లో చదువుకునేవాళ్ళు, ఆఫీసుల్లో ఉద్యోగాలు చేసేవాళ్ళు ఉన్నారు. కొందరు యేదో ఒక నవల మాత్రమే చదివి ఆ నవల మాకు బాగా నచ్చిందని చెబుతూ ఒక ఉత్తరం మాత్రమే రాసి మానేస్తుంటారు. ఇలాంటి వాళ్ళను త్వరగానే మరచిపోతాం. కాని కొందరేమో నేను రాసే ప్రతి నవలా చదువుతూ రచయితగా నామీద ఎంతో ఇంటరెస్టు చూపుతూ, నా రచనల్లోని లోపాల్ని కూడా ఎత్తిచూపుతూ రెగ్యులర్‌గా ఉత్తరాలు రాస్తుంటారు - ఇలాంటి పాఠకుల ఉత్తరాలకు నేను చాలా ప్రాధాన్యం ఇస్తాను - ఇలాంటి పాఠకులలో కొందరితో నా పరిచయం కేవలం ఉత్తరాల వరకే పరిమితం కాకుండా వాళ్లను వ్యక్తిగతంగా కలుసుకోవడం, వాళ్లతో శాశ్వతమైన స్నేహాన్ని యేర్పరచుకోవటం కూడా జరిగింది. ఇలాంటి శాశ్వతమైన స్నేహం నాకు కొందరు స్త్రీ పాఠకులతో కూడా యేర్పడింది.

మా ఆఫీసు పనిమీదనో, లేక యేవైనా సాహితీ సమావేశాల్లోనో పాల్గొనటానికి వెళ్లటంద్వారానో నేను తెలుగుదేశం లోని చాలా ప్రాంతాలకు వెళ్తుంటాను.

అలా వెళ్లినప్పుడల్లా ఆయా ప్రాంతాల్లో వున్న నా అభిమానులకు మొదలే ఉత్తరాలు రాసి వాళ్లను కలుసుకోవడానికి ప్రయత్నించేవాడిని. ఇలా ఉత్తరాలద్వారా యేర్పడిన పరిచయాన్ని స్నేహంగా మార్చుకోవటమంటే నాకు చాలా ఇష్టం - స్త్రీ పాఠకులతోనైనా, పురుష పాఠకులతోనైనా ఇలాంటి స్నేహాన్ని ఏర్పరచుకోవటం నాకెంతో అపూర్వంగా, ఆనందదాయకంగా ఉంటుండేది.

యేదో ఉబుసుపోకకు ఒక రచయితతో పరిచయం చేసుకొని అతనితో ఉత్తరం రాయించుకున్నానని చెప్పుకోవాలన్న ఉబలాటంతో రాసేవాళ్లను నేనంతగా పట్టించుకొనేవాడిని కాదు. రచయితగా నా స్ట్రాంగ్ పాయింట్స్‌ను చక్కగా అర్థం చేసుకొని, నా వీక్ పాయింట్స్‌ను కూడా ఎత్తిచూపుతూ ఒక అవ్యాజమైన ఆత్మీయతను ప్రదర్శిస్తూ, భాషలోను, భావాల్లోను సంస్కారం, కవితా హృదయం గోచరించే ఉత్తరాల్ని నా హృదయంలోకి తీసుకునేవాడిని - ఇలాంటి ఉత్తరాలు ఎంత ఎక్కువగా వస్తే అంత ఎక్కువగా ఉత్తేజాన్ని పొందేవాడిని - అలాంటి ఉత్తరాల్ని రచయితగా నేను సంపాదించిన అన్నింటికంటే గొప్ప ఆస్తులుగా భావించి భద్రపరుచుకునేవాడిని. గీత నాకలాంటి ఉత్తరాలు రాస్తుండేది. ఆ అమ్మాయి నొకసారి తప్పకుండా కలుసుకోవాలనుకున్నాను.

అమ్మాయిల్ని కలుసుకోవడంలో కొన్ని ఇబ్బందులున్నాయి. ఆ మధ్య హైదరాబాద్ నుండి నాకు మృణాళిని అన్న అమ్మాయి గొప్ప కవితావేశంతో, ప్రతి అక్షరంలోనూ ఆత్మీయతను నింపి ఉత్తరాలు రాస్తుండేది. హైదరాబాద్‌కు చాలాసార్లు వెళ్తుంటాను కాబట్టి ఆ అమ్మాయిని కలుసుకోవాలనుకున్నాను. ''ఫలానారోజు హైదరాబాద్ వస్తున్నాను. నీకభ్యంతరం లేకపోతే నిన్ను కలుసుకుంటాను'' అని రాశాను. ఆ అమ్మాయినుండి వెంటనే రిప్లై వచ్చింది. ''మీకెంత ధైర్యమండి! నన్ను కలుసుకుంటారా? అమ్మబాబోయ్! మా అన్నయ్య చంపేస్తాడు. మన పరిచయం ఇలా ఉత్తరాల వరకే ఉండనీయండి

బాబూ!'' అని రాసింది. చాలా ఆశ్చర్యపడ్డాను. పెద్దపెద్ద పట్టణాల్లో, కాలేజీల్లోను, యూనివర్సిటీల్లోను చదువుకుంటున్న అమ్మాయిల మీద ఈరోజుల్లో కూడా ఇలాంటి నిబంధనలుండటం, అలాంటి నిబంధనల్ని ఆ అమ్మాయిలు సహించడం!

కాని నాకు ఉత్తరాలు రాసిన అమ్మాయిల్లో మృణాళినిలాంటివాళ్ళు చాలా తక్కువే. - 'నేను మీ ఊరొచ్చి నిన్ను కలుసుకుంటాను' అని రాస్తే 'తప్పకుండా కలుసుకోండి... మీ కోసం ఎదురుచూస్తుంటాను' అని రాసిన వాళ్ళే ఎక్కువ - ఇలా విజయవాడ, ఏలూరు, విశాఖపట్టణం, మహబూబ్‌నగర్, తిరుపతి మొదలైన ఊళ్లకు వెళ్లినప్పుడు అక్కడి నా అభిమానుల్ని కలుసుకున్నాను. వాళ్ళ ఉత్తరాల్ని బట్టి ఒక్కొక్క అమ్మాయిని ఒక్కొక్క రకంగా ఊహించుకునేవాడిని - కొందరు నా ఊహకు చాలా దగ్గరగా వచ్చేవాళ్ళు - కొందరు అందుకు పూర్తి భిన్నంగా ఉండేవాళ్ళు - అయినా నేను ఆశ్చర్యపడేవాణ్ని కాదు - బాహ్యరూపం నాకెప్పుడూ ప్రధానం కాదు - వాళ్ళ హృదయాలు - వాళ్ళ హృదయాల్లో రచయితగా నా మీదుండే ఆరాధన - వాళ్ళు నా మీద చూపించే నిష్కల్మషమైన నిస్వార్థమైన, నిర్మలమైన అభిమానం - వీటికే నేను అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేవాడిని.

స్నేహం విషయంలో స్త్రీలను, పురుషులను నేనెప్పుడూ వేరుగా చూళ్ళేదు. సెక్స్‌తో ఎలాంటి సంబంధం లేని శాశ్వతమైన స్నేహం స్త్రీలతో కూడా సాధ్యమేనని రచయితగా నా పదేళ్ళ అనుభవం నాకు నేర్పింది.

* * *

గీత ఉత్తరానికి వెంటనే సమాధానం రాద్దామనుకున్నాను - కాని ఆమె ఉత్తరం వచ్చిన మరునాడే విజయవాడలో ఉండే నా మరో అభిమాని కవిత దగ్గర్నుండి ఆమె మ్యారేజీ ఇన్విటేషన్, ''పెద్ద ఉత్తరం రాసే టైమ్ లేదు మేస్టారు - 26-2-80నాడు రాత్రి పదిన్నర గంటలకు నా పెళ్ళి - మీరు తప్పకుండా రండి మాస్టారు. మీ కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తాను. మీ అభిమాని కవిత'' అన్న ఉత్తరం వచ్చాయి.

కవిత నాకు చాలాకాలంగా తెలుసు. విజయవాడకు వెళ్లినప్పుడల్లా వాళ్ళింటికి తప్పకుండా వెళ్తుంటాను. వాళ్ల అమ్మ, నాన్న, అన్నయ్య, చెల్లెళ్ళు - అందరూ నాకు ఫ్రెండ్సయ్యారు. వాళ్ళంతా నన్నెంతో అభిమానిస్తారు. కవిత పెళ్ళికి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. అప్పుడే గుంటూరు దాకా వెళ్ళి గీతను కూడా కలుసుకుని ఆమెను సర్‌ప్రైజ్ చెయ్యాలని నిర్ణయించుకున్నాను. అందుకే నేను ఫలానా రోజుకు గుంటూరుకు వస్తున్నానని గీతకు లెటర్ రాయలేదు.

26వ తేదీనాడు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడలో దిగి ఆ రాత్రి కవిత పెళ్ళి అటెండ్ చేసి ఆ మర్నాడు గుంటూరుకు బయల్దేరాను.

ఉదయమే లేచి, స్నానం చేసి బ్రేక్‌ఫాస్ట్ ముగించుకుని, విజయవాడలోని నాకు చాలా సన్నిహితుడైన ఒక పత్రికా సంపాదకుడిని కలుసుకొని, అతనితో కాస్సేపు మాట్లాడి బస్టాండ్

చేరుకునేటప్పటికి 11 గంటలయింది. అప్పటికే ఎండ మండిపోతోంది.

అరగంటసేపు క్యూలో నిల్చున్నాక నాకు టికెట్ దొరకడం, బస్సులో ప్రవేశించడం జరిగాయి.

గుంటూరులో బస్సు దిగేటప్పటికి పన్నెండున్నరయింది.

సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. ఆ ఎండను చూస్తే భయమేసింది.

గుంటూరు నాకు కొత్త. విజయవాడకెన్నో సార్లొచ్చానుగాని గుంటూరుకు రావటం ఇదే మొదటిసారి. బస్సు దిగేముందు జేబులో ఉన్న గీత అడ్రస్ తీశాను.

''గీత, కేరాఫ్ సీతారామారావు, అడ్వకేట్, 3-10-85, కొత్తపేట, గుంటూరు'' అదీ అడ్రస్.

బస్సు దిగగానే ''బండి కావాలా బాబూ'' అని రిక్షావాళ్ళు నా చుట్టూ మూగారు. వాళ్ళందర్నీ తప్పించుకుని కొంచెం దూరం వెళ్ళి కాస్త సిన్సియర్‌గా కనిపించిన ఓ రిక్షావాడిని పిల్చి గుంటూరు బాగా తెలిసినవాడికి మల్లేనే ఫోజు పెడ్తూ -

''కొత్తపేట వస్తావా?'' అని అడిగాను.

''ఎక్కండి బాబయ్యా?'' అన్నాడతడు రిక్షా తెచ్చి నా పక్కన పెడ్తూ -

''ఎంతివ్వమంటావు?'' అన్నాను.

''ఓ రూపాయివ్వండి బాబూ'' అన్నాడతడు.

మరోమాట మాట్లాడకుండా రిక్షా ఎక్కి కూర్చున్నాను.

కొత్తపేట ఎంత దూరం ఉంటుందో నాకు తెలీదు. రూపాయే అడిగాడు. కాబట్టి చాలా దూరం ఉండకపోవచ్చుననుకున్నాను.

చెప్పాపెట్టకుండా అకస్మాత్తుగా ఊడిపడిన నన్నుచూసి గీత ఎంత ఆశ్చర్యపడ్తుందో! ఆమెనలా ఆశ్చర్యంలో ముంచేసి తనివితీరా హాయిగా నవ్వాలని నా ప్లాన్! ఆ క్షణాన్ని ఊహించుకోవడమే నాకెంతో హాయిగా మధురంగా ఉంది. రెండు మూడు రోజుల్నించి ఆ క్షణాన్ని గురించే ఎన్నో రకాలుగా ఊహించుకున్నాను. ''హల్లో గీతా! అయామ్ వికాస్!'' గీతకు ఎదురుగా నిల్చొని, ఆమె కళ్ళల్లోకి చూస్తూ నేనలా అన్నప్పుడు గీత ఎంతో ఆశ్చర్యంతో తబ్బిబ్బయిపోతోంటే చూడాలి! ఊహించుకుంటేనే ఇంత థ్రిల్! కొన్ని క్షణాల్లో నా ఊహ నిజం కాబోతోంది. అప్పుడింకెంత థ్రిల్లింగా ఉంటుందో.

విశాలమైన రోడ్లతో గుంటూరు పట్టణం చాలా అందంగానే ఉంది. ఇరుకు రోడ్లతో, ఎప్పుడూ ట్రాఫిక్ జామ్స్‌తో తొక్కిసలాడ్తుండే విజయవాడను చూశాక గుంటూరును చూడటం నా కళ్లకెంతో హాయిగా ఉంది.

''కొత్తపేటలో ఎక్కడికెళ్ళాలి బాబూ!'' అన్నాడు రిక్షావాడు.

''అప్పుడే కొత్తపేట వచ్చేసిందా?'' అన్నాను రోడ్డుకిరుపక్కలా చూస్తూ.

''ఇదంతా కొత్తపేటే బాబూ!'' అన్నాడు రిక్షావాడు

గుంటూరు నాకు కొత్త అన్న విషయం ఇక దాచి లాభం లేదని అతనితో చెప్పాను.

''సీతారామారావుగారని ఇక్కడొక అడ్వకేట్ ఉండాలి – నా దగ్గర అతని ఇంటి నెంబర్ కూడా ఉంది. ఆ ఇల్లెక్కడో కాస్త చూడు బాబూ'' అన్నాను.

''మీరే దిగి అడగండి బాబూ – ఎవరైనా చెబుతారు''

అన్నాడతడు అతడి ముఖంమీద కారుతున్న చెమటను తుడుచుకుంటూ.

రిక్షా దిగి ఆ వీధిలో ఉన్న ఇంటి తలుపులమీది ఇంటి నెంబర్లను పరీక్షించాను – నా దగ్గరున్న నెంబర్ ఆ ప్రాంతంలో ఎక్కడా కనిపించే ఆశ కనిపించలేదు –

చాలా భయంకరంగా తాండవిస్తున్న ఆ ఎండవల్ల కాబోలు – ఆ వీధిలో జన సంచారం చాలా తక్కువగా ఉంది – కొంచెం దూరం నడిచాక ఒక ఇంటిముందు జగన్నాథరావు – అడ్వకేట్ అన్న బోర్డు కనిపించింది. ఈ అడ్వకేట్ గార్కి ఆ అడ్వకేట్‌గారు తెలిసే ఉంటాడని ఆ ఇంటిముందు ఆగాను. మెల్లిగా ఆ ఇంటి తలుపుమీద శబ్దం చేశాను – ఎవరూ రాలేదు. ఇంట్లో అసలు జనసంచారం ఉన్నట్లు కనిపించలేదు.

ఈసారి కాస్త గట్టిగా శబ్దం చేసి ''యేమండి'' అని పిల్చాను.

''ఎవరూ?'' అంటూ లోపల్నించి కళ్లద్దాలు పెట్టుకున్న ఓ మధ్య వయస్కుడు చేతిలో 'హిందూ' పేపర్ పట్టుకొని బయటకొచ్చాడు.

''అడ్వకేట్ జగన్నాథరావు గారు మీరేనా అండి'' అన్నాను.

''ఔను... మీరెవరు?''

''నేనీ ఊరికి కొత్తలెండి – నాకు సీతారామారావు గారన్న అడ్వకేట్ గారిల్లు కావాలి. ఆయన ఇక్కడే కొత్తపేటలో ఉండాలి – ఇదిగో వారింటి నెంబర్'' అంటూ నా చేతిలో ఉన్న గీత అడ్రస్ ఆయన చేతికిచ్చాను. ఆయన కొద్దిసేపు ఆ అడ్రస్‌ను పరీక్షించి ''ఓహో! సీతారామారావు కదూ! ఔను ఇక్కడే అదిగో ఈ విధి చివర్లో ఉండేవాడు – రెండు రోజుల క్రితమే ఆయన ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయాడు'' అన్నాడాయన.

నా కాళ్ళకింది భూమి కదిలిపోయినట్టుగా ఫీలయ్యాను – గొంతులో తడి పూర్తిగా ఆరిపోయింది – వెంటనే మాట పెగిలి రాలేదు –

''వా వా వాళ్ళు ఎక్కడికెళ్ళారో మీకు తెలుసాండి...'' అన్నాను అతికష్టంగా.

''నాకు తెలీదుగానీ మా ఆవిడకు తెలుసనుకుంటాను... యేమే పద్మావతీ'' అని కేకేశాడాయన.

''ఆ! వస్తున్నా'' అంటూ ఆయన భార్య అక్కడికొచ్చింది.

''సీతారామారావు వాళ్ళు మొన్ననేగా వాళ్ళిక్కడుంటున్న ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయారు – వాళ్ళు తీసుకున్న కొత్త ఇల్లు ఎక్కడో నీకు వాళ్ళావిడ చెప్పే వెళ్లింది కదూ?''

''వాళ్ళిప్పుడు రామన్నపేటలో ఉంటున్నారండి'' అందామె వెంటనే.

''ఇంటి నెంబరుందాండి'' అన్నాన్నేను.

''ఇంటి నెంబరు లేదు - హరిహర మహలు సినిమాహాలు దగ్గర అని చెప్పింది'' అందామె.

''అక్కడికి వెళ్ళి అడగండి - ఎవరైనా చెబుతారు'' అన్నాడు జగన్నాథరావుగారు.

''చాలా థ్యాంక్సండి'' అన్నాను చేతి రుమాలుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ.

''యేం బాబూ! కాసిన్ని మంచినీళ్ళు తాగుతావా? మంచి ఎండలో వచ్చావు?'' అంది అడ్వకేట్‌గారి భార్య.

''ఇవ్వండి'' అన్నాను.

ఆమె చెంబుతో చల్లని మంచినీళ్ళు తెచ్చిచ్చింది - అవి తాగేసి మరోసారి వాళ్లకు థాంక్స్ చెప్పి బయటకొచ్చాను.

బయట రిక్షావాడు నాకోసం వెయిట్ చేస్తున్నాడు -

''రామన్నపేటకు తీసుకెళ్ళు బాబూ'' అన్నాను అతని రిక్షాలో కూర్చుంటూ.

''రామన్నపేటా? ఇక్కణ్ణించి బోల్డు దూరం బాబూ...'' అన్నాడు రిక్షావాడు.

''ఫరవాలేదు. నీ కష్టం ఉంచుకోను పద'' అన్నాను వెంటనే గీతను చూడాలన్న పట్టుదలతో -

''ఎండ చూడండి బాబూ! ఎలా మండిపోతోందో'' అన్నాడు రిక్షావాడు రిక్షాను మెల్లగా కదిలిస్తూ -

ఎంతో సులభంగా గీతను కలుసుకోవాలనుకున్న నేను ఈ అనూహ్యమైన మలుపుతో కొంత నిరుత్సాహ పడిపోయినా అడ్వకేట్‌గారి భార్య నన్ను రక్షించింది.

ఫరవాలేదు. ఇదీ ఒక అనుభవమే! నేను వస్తున్నానని గీతకు ఉత్తరం రాయకపోవటం, రెండు రోజుల క్రితమే వాళ్ళు ఇల్లు మారటం! ఇట్ జస్ట్ హాపెన్స్ లైక్‌దట్! అనుకొని నాలోనేను నవ్వుకున్నాను. ఇదంతా చెప్పి తను ఇంకా ఆశ్చర్యంలో ముంచెయ్యొచ్చు... ''అయ్యో మాస్టారూ! నా కోసం ఎంత కష్టపడ్డారా? ముందుగా రాస్తే నేను స్టేషన్‌కొచ్చి మిమ్మల్ని రిసీవ్ చేసుకునేదాన్నిగా...'' అంటుంది గీత. ముందుగానే నేను వస్తున్నానని తెలిస్తే ఇంత థ్రిల్ ఉండేదా?'' అంటాన్నేను.

నిప్పులు కురుస్తున్న ఆ ఎండలో ఓ డొక్కు రిక్షాలో ప్రయాణం చేస్తున్న నాకు మరికొన్ని క్షణాల్లో గీతను కలుసుకోబోతున్నానన్న ఆలోచన నా హృదయానికి మల్లెపూల మత్తులాంటి చల్లదనాన్ని కలిగించింది.

చాలా సందులు గొందులు తిప్పి ఒక అరగంట తర్వాత 'ఇదేనండి ఆ సినిమా హాలు'

అన్నాడు రిక్షావాడు.

''రామన్నపేట అంటే కూడా ఇదేనా?'' అన్నాను.

''ఔనండి... సినిమాహాలు వెనుక అన్నారుగా... యెళ్లడగండి...'' అన్నాడు రిక్షావాడు. తనిక నన్ను ఇంకో క్షణం కూడా మోయలేనన్నట్టుగా –

రిక్షా దిగి 'యేమివ్వమంటావు?' అన్నాను జేబులోంచి పర్స్ తీసి –

''మీకు తెల్దాబాబూ!'' అన్నాడతడు నొసలుమీద పట్టిన చెమటను తుడుచుకుంటూ.

పర్స్‌లోంచి ఐదు రూపాయల నోట్ తీసి అతడు తప్పకుండా తృప్తిపడ్తాడని ఇవ్వవలసిన దానికంటే కొంచెం ఎక్కువగానే ఇస్తున్నాననుకుంటూ అతని చేతిలో పెట్టబోయాను.

''యేంటి బాబూ! మీరు నాకేమన్నా ధర్మం చేస్తున్నారా?''

అన్నాడు రిక్షావాడు నేనివ్వబోతున్న ఐదురూపాయల నోటును చాలా ఈసడింపుగా చూస్తూ –

నేను షాకైపోయాను – అతడికేం సమాధానం చెప్పాలో తోచలేదు. కొన్ని క్షణాలసేపు అతడికేసి గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాను.

కాకీ నిక్కరూ, అక్కడక్కడ చిరుగులుపడిన బనియన్ వేసుకున్నాడు. తలంతా రెల్లుగడ్డిలా రేగివుంది. మాసిన గడ్డం – లోతుకుపోయిన చిన్న చిన్న కళ్ళు ... సన్నగా, పొట్టిగా వున్నాడు – కాళ్ళకు చెప్పుల్లేవు. చూస్తే చాలా అమాయకుడిలా వున్నాడు. కాని అతనిపట్ల ఎంతో న్యాయంగా ప్రవర్తించాననుకున్న నా మిడిల్ క్లాస్ మొరాలిటీ మీద చాలా పెద్ద దెబ్బే కొట్టాడు –

అతనితో ఎక్కువసేపు వాదించే ఓపికలేదు –

''ఎంతివ్వమంటావు చెప్పు'' అన్నాను అతన్నలాగే చూస్తూ

''చూశారుగా ఎండలో ఎంతదూరం తిరిగామో''! ఇంతెండలో నేను తప్ప మరెవడూ రిక్షాకట్టేవాడు కాడు – నా కష్టాన్నిచూసి మీరే ఇవ్వండి'' అన్నాడు –

''నేను ఇవ్వాలనుకున్నది ఇవ్వబోయాను – నువ్వు తీసుకోలేదు – నీ కెంత కావాలో త్వరగా చెప్పు'' అన్నాను –

''ఓ పది రూపాయలిప్పించండి అన్నాడతడు మరో వైపు చూస్తూ.

''దిసీజ్ టూమచ్'' అన్నాను కాని అది అతన్ని ఉద్దేశించి అన్నమాట కాదు – నాలో నేనుగొణుక్కున్న మాట – నా కళ్ళకు అతడెలా అమాయకంగా కనిపించాడో అతడి కళ్ళు నేనూ అలాగే ఎంతో అమాయకంగా కనిపించి ఉంటాను –

మరో మాట మాట్లాడకుండా అతని చేతిలో రెండు ఐదు రూపాయల నోట్లు పెట్టేసి.

''ఇదిగో బాబూ! పది రూపాయలు. ఈ పది రూపాయలు తీసుకొని ఈ రోజు చాలా

మంచి బేరం తగిలిందని ఉబ్బి పోతూ యే సారా కొట్టుకో వెళ్ళకుండా చెప్పుల షాపుకెళ్ళి నీ కాళ్ళకి రెండు చెప్పులు కొనుక్కుంటే నేను చాలా సంతోషిస్తాను'' అని చెప్పేసి అక్కణ్ణించి కదిలాను -

నేనే మన్నానో అతనికేమీ అర్థమయి ఉండదని నాకు తెలుసు - అయినా అతనికా సలహా ఇచ్చినందుకు నాలో యేదో తృప్తి.

యేదో రకంగా మన అహాన్ని తృప్తి పరచుకోకపోతే ఈ ప్రపంచంలో బ్రతకలేం.

కొంతసేపు నేను అక్కడ ఎందుకున్నానో, ఎక్కడికెడ్తున్నానో మరచి పోయాను - కొంతదూరం రిక్షావాడిని గురించి ఆలోచిస్తూ నడిచాక మెయిన్ రోడ్డుపక్కనున్న ఒక బైలేన్‌కు ఎదురుగా 'రామన్నపేట' అన్న బోర్డు చూడటంతో నేను వెతుకుతున్న దేమిటో అప్రయత్నంగా నా వశమైనట్టుగా నా హృదయం ఎగిరిగంతేసింది. వెంటనే లేన్‌లోకి తిరిగాను -

ఆ లేన్ సరిగ్గా సినిమాహాలుకు వెనకాలే వుంది కాబట్టి ఇక్కడే ఎక్కడో గీతా వాళ్ళ ఇల్లుంటుందని, కొద్ది క్షణాల్లో నా అన్వేషణ ఫలించబోతోందని నమ్మకం కుదరటంతో నాలో మళ్ళీ ఉత్సాహం పుంజుకుంది.

రెండు మూడు ఇళ్ళు దాటాక ఒక ఇంటి ముందు ఆగాను - ఆ ఇంటి ముందు ఇద్దరు కుర్రాళ్ళు కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు - వాళ్ళను పిలిచి.

''ఏం బాబూ! ఇక్కడ సీతారామారావు.-రని అడ్వొకేట్ గారిల్లు తెలుసా?'' అని అడిగాను - ''ఇంటి నెంబరుందా?'' అన్నాడొక కుర్రాడు.

''లేదు - వాళ్ళదివరకు కొత్తపేటలో ఉండేవాళ్ళు. రెండు రోజుల క్రితమే ఇక్కడ కొచ్చారట'' అన్నాను -

''అయితే మాకు తెలీదు'' అంటూ వాళ్ళిద్దరూ మళ్ళీ వాళ్ళు కూర్చున్న చోటికి వెళ్ళిపోయారు.

ఇంకా కొంచెం ముందుకు నడిచాను. ప్రతి ఇంటిముందున్న నేమ్ ప్లేట్‌ను జాగ్రత్తగా పరిశీలిస్తూ నడుస్తున్నానరు. మళ్ళీ ఎవరైనా అడ్వొకేట్ తగలక పోతాడా? సీతా రామారావుగారిల్లు చూపించకపోతాడా అని ''అడ్వొకేట్'' అన్నమాట ఎక్కడైనా కనిపిస్తుందేమోనని వెతకసాగాను - కాని ఆ ప్రాంతంలో అడ్వొకేట్లెవరూ ఉన్నట్లు లేదు. ప్రతి ఇంటినీ పరీక్షగా చూస్తూ ఆ వీధి చివరిగా వెళ్ళాను. ఏ ఇంట్లోంచైనా గీత బయటకొచ్చి నన్ను గుర్తించి సంభ్రమాశ్చర్యాలతో మునిగిపోతూ ''రండి మేష్టారూ? అని ఆహ్వానిస్తుందని ప్రతి ఇంటిముందు ఒకటి రెండు నిముషాలు ఆశగా నిల్చున్నాను. అయినా ఇంతకు ముందు నన్నెప్పుడూ చూడని గీత నన్నెలా గుర్తిస్తుందని? రెండు మూడు పత్రికల్లో నా ఫోటో పడింది. ఆ ఫోటోను తను చూశానని, అందువల్ల మిమ్మల్ని చూడగానే నేను గుర్తిస్తానని ఇది వరకొకసారి గీత నాకు రాసింది.

ఆ వీధి చివర ఉన్న ఇంటిముందు ఒక ముసలామె కూర్చొని ఉంది. ఆ ఇంట్లోకెళ్ళి

''యేమండీ ... ఇక్కడ సీతారామారావు గారని అడ్వొకేట్ గారిల్లు మీకేమయినా తెలుసా? అని అడిగాను.

''ఇదిగో అమ్మాయి అరుణా!, ఎవరో వచ్చారు చూడమ్మా!? అంటూ ఆ ముసలామె కేకేసింది –

లోపల్నుంచి పద్దెనిమిది లేక పందొమ్మిదేళ్ళున్న ఓ అందమైన అమ్మాయి ''యేమిటి బామ్మా!'' అంటూ వచ్చి నన్ను చూసి ఓ క్షణం సేపు ఆశ్చర్యపడి

''ఎవరికోసం వచ్చారండీ?'' అంది – ఈమే గీతైతే ఎంత బాగుండును?

''ఇక్కడ సీతారామారావుగారని అడ్వొకేట్ ...... వాళ్ళెక్కడుంటారో మీకు తెలుసాండి?'' అన్నాను.

''ఇక్కడ అడ్వొకెట్లెవరూ లేరే అయ్యో! ఎండలో నిల్చున్నారు లోపలకు రండి'' అందా అమ్మాయి అప్యాయంగా –

ఎందుకోగాని ఆ అమ్మాయి చూస్తోంటే ఇదివరకెక్కడో చూసినట్లుగా ఫీలయ్యాను –

''మంచినీళ్ళు తాగుతారా?'' అంటే అమ్మాయి లోపల కొచ్చిన నాతో –

''ఆ'' అన్నాను.

వాళ్ళింటి ముందు హాల్లో నిలుచున్నాను. పైన సీలింగ్ ఫ్యాన్ తిరుగుతోంది. ఎండలో పడి తిరిగొచ్చిన నా ప్రాణానికి ఆ ఫ్యాన్ గాలి ఎంతో హాయిగా వుంది. వీళ్ళింట్లోనే కాస్సేపు కూర్చొని ఈ అరుణతో నేనో రచయితనని పరిచయం చేసుకొని, కాస్సేపు మాట్లాడి వెళ్ళిపోదాం మనుకున్నాను. ఈ అరుణ కూడా నేను రాసిన యేదో ఒక నవల తప్పకుండా చదివే వుంటుంది.

అరుణ మంచినీళ్ళ గ్లాసుతో హాల్లో కొచ్చింది.

ఆ గ్లాసెడు చల్లని నీళ్ళు గటాగటా తాగేశాను. నీరసించిపోతున్న నా సర్వేంద్రియాలకు కొత్త జీవనం వచ్చింది.

ఇంతలో నా బుర్రలో ఒక ఐడియా మెరిసింది.

''అరుణగారు! మీకు గీత అనే అమ్మాయి తెలుసా! బి ఎస్ సి, సెంకడియర్ చదువుతోంది?''

వెంటనే అడిగేశాను.

''నేనూ బి ఎస్ సి సెకండియరే చదువుతున్నాను. కాని మా కాలేజీలో గీత అనే అమ్మాయెవరూ లేరండి. యే కాలేజిలో చదువుతోందో తెలుసా?

''అదే తెలీదు... థ్యాంక్సండి... వస్తాను'' అంటూ అక్కణ్ణించి కదిలాను.

ఆ అమ్మాయి తన పెద్ద పెద్ద కళ్ళతో నాకేసి జాలిగా చూసింది. ఆమెకు నేను ఫలానా అని చెప్పుకుంటే తప్పకుండా నన్ను గుర్తించేది. కాని నాకు కొత్తవాళ్ళతో 'నేను రచయితను... ఫలానా ఫలానా నవలలు రాశాను' అని చెప్పుకోవటం బొత్తిగా ఇష్టముండదు.

మళ్ళీ వీధిలో పడ్డాను - నిప్పులు చెరుగుతున్న సూర్యుడు నా నేస్తం.

ఇప్పుడేం చెయ్యాలి? కడుపులో పేగులు గుర్రుమన్నాయి... ఆకలి! టైమ్ రెండు గంటలౌతోంది. గీత కిక గుడ్‌బై చెప్పేసి యే హోటల్‌కైనా వెళ్ళి భోజనం చేసేసి బస్సు స్టాండ్ కెళ్ళి విజయవాడకెళ్ళి పోదామనుకున్నాను.

నో నో నో! పడ్డ కష్టం ఎలాగూ పడ్డావు. ఇంకాస్సేపు వెతికితే గీతను కలుసుకోవచ్చు. నీ కోసం ఇంత కష్టపడ్డానని చెబితే గీత ఎంత బాధపడ్తుందో చూడాలి.

కాని ఈ బాధంతా కొన్ని రోజుల తర్వాత ఒక మధురస్మృతిగా నిలిచిపోతుంది. ఇంత అన్వేషణ తర్వాత గీతను కలుసుకోవటం నా స్మృతి పథంలో ఒక మధుర స్మృతిగా, ఒక అద్భుత అనుభవంగా మిగిలిపోతుంది.

గీతను కలుసుకోకుండా వెళ్ళిపోకూడదన్న పట్టుదల నాలో ద్విగుణీకృతమైంది.

ఇలా ఆలోచిస్తూ నిల్చున్న నాకు సైకిల్ మీద అటువైపు ఒక పెద్ద మనిషి కనిపించాడు. అతన్ని ఆపి ''ఇక్కడ సీతారామారావు గారని అడ్వోకేట్ గారిల్లు తెలుసాండి?'' అని అడిగాను.

''సీతారామారావా? అడ్వోకేటా? ఈ వీధి పక్కనే మరో వీధుంది - ఆ వీధిలో నిన్ననే పేరు జ్ఞాపకం లేదు గాని అడ్వోకేట్ అని ఉన్న ఒక బోర్డును చూసినట్టు గుర్తుంది'' అన్నాడతడు. నాలో హరించిపోతున్న ఆశ చిగురించింది.

''ఎక్కడ చూశారు. ప్లీజ్ చెప్పండి. ఆ ఇంటి కోసం ఈ ఎండలో నేను గంటసేపట్నుంచి వెతుకుతున్నాను. ప్లీజ్ కాస్త చూపించండి''.

''చెప్పానుగదండి ఈ పక్క వీధిలో నని .. ఇదిగో చక్కగా అలా కనిపిస్తోందే మెయిన్‌రోడ్డు... అక్కడిదాకా వెళ్ళి లెఫ్ట్‌కి తిరగండి. ఇలాంటిదే మరో వీధి వస్తుంది. ఆ వీధిలో చూడండి'' అంటూ అతను సైకిలెక్కి నేను ''థ్యాంక్సండి'' అంటున్న మాట కూడా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

నేను వేగంగా మెయిన్‌రోడ్డు దాకా నడిచాను.

''ఇట్సె మిరకల్... ఇంపాజిబుల్ అనుకున్నది పాజిబుల్ అవుతోంది. గీతను కలుసుకోవటం ఇప్పుడిక డెఫినిట్...''

ఆ వీధి చివరిదాకా నడిచి లెఫ్ట్‌కు తిరగాను.

మళ్ళీ ఒక్కొక్క ఇంటిని నా కళ్ళల్లో ఉన్న శక్తినంతటిని కూడదీసుకొని పరీక్షగా

'అడ్వకేట్' అన్న ఆ నాలుగు అక్షరాలు నాకు గగనకుసుమాలే అయ్యాయి.

అలా ఆ వీధి చివరిదాకా వెళ్ళాను.

నాకు పిచ్చెక్కినంత పనైంది.

యూ ఆర్ ఎ. ఫూల్ ఇప్పటికైనా ఈ వెర్రి ప్రయత్నం వదిలేసి వెళ్ళిపో... వెళ్ళిపో... వెళ్ళిపో.... యే హోటల్‌కైనా వెళ్ళిపో... ఆకలి... దాహం... కడుపులోని పేగుల్ని సల్ఫ్యూరిక్ ఆసిడ్‌లా ఆకలి కొరికేస్తోంది. దావాగ్నిలా దాహం దహించి వేస్తోంది... కళ్ళలో చీకట్లు కమ్ముతున్నాయి. కాళ్ళల్లో సత్తువ నశించి పోతోంది. యే క్షణంలోనైనా నేలకొరిగి పోవటం తప్పదు. నా సర్వేంద్రియాలు ఈ వేడికి ఆహుతై పోవటం తప్పదు.

''అభిమాని కోసం ఆహుతైపోయిన రచయిత'' అని రేపటి పేపర్లో వస్తుంది అందరూ వింతగా చదువుతారు. 'అభిమానుల్ని ఇంతగా పట్టించుకునే రచయితలు కూడా ఉంటారన్నమాట అని అందరూ ఆశ్చర్యపడ్తారు. తన సమాధి మీద ''ఒక అభిమాని కోసం తన జీవితాన్ని ఆహుతి చేసిన ఒక అభాగ్యుడు'' - అని రాయాలి. అప్పుడు గాని తన ఆత్మ శాంతిస్తుంది.

కసిగా నవ్వుకున్నాను.

ఎవరిమీద ఈ కసి?

పాపం ఇందులో గీత తప్పేంలేదు. వస్తున్నానని మొదలే రాస్తే తన అడ్రస్ మారిందని తెలియజేసేది. ఆమెను సర్‌ప్రైజ్ చెయ్యాలని ఇదంతా తనే కొని తెచ్చుకున్నాడు -

ఇప్పుడేం చెయ్యటం?

నాలోని ప్రతి అణువు వెంటనే వెళ్ళిపోదామంటోంది - కాని నాలో ఇంకా యేదో ఆశ ... ఇంతదూరం వచ్చి ఇంత కష్టపడి గీతను చూడకుండా వెళ్ళిపోవటమేమిటి? పేకాటలో డబ్బు పోగొట్టున్న ఆటగాడు డబ్బు పోతున్న కొద్దీ ఇంకా ఆడతాడు... నెక్స్ట్‌గేమ్ పోయిందంతా వస్తుందన్న ఆశతో - నా పరిస్థితి అలా వుంది.

ఇంతలో అక్కడ ఇన్‌షర్ట్ వేసుకొని చేతులో 'సన్‌డే' మ్యాగజిన్ పట్టుకొని వెడ్తున్న యువకుడొకాయన కనిపించాడు.

వెంటనే నేనొక నిర్ణయం తీసుకున్నాను.

ఇతడే ఆఖరువాడు - ఇతన్ని అడుగుతాను. ఇతడు చెప్పాడా సరె. లేకపోతే డెఫినెట్‌గా వెళ్ళిపోతాను.

''ఇదిగో మిష్టర్! ఇక్కడ సీతారామారావు అన్న అడ్వొకేటొకాయన వుండాలి. ఈ వీధిలోననే చెప్పారు. మీకేమయినా తెలుసా?''

''ఆ! తెలుసండి... నిన్ననో మొన్ననో వచ్చినట్టున్నారు కదండి....''

''ఔనండి... ఇది వరకు కొత్తపేటలో ఉండేవాళ్ళు''

''మా ఇంటిపక్కనే... రండి చూపిస్తాను''

దటీజ్ ది మిరకల్ ఇట్ హాపెన్డ్!

''థ్యాంక్సండి... థాంక్యూ వెరీమచ్ ఆ ఇంటికోసం గంటసేపట్నించి వెతుకుతున్నాను'' అన్నాను...

ఆ వీధిలోనే వెనక్కి కొంచెం దూరం వెళ్ళాక మళ్ళీ లెఫ్ట్‌కి తిరిగితే చిన్న సందు.... అందులో ఆ సందులో కొంచెం దూరం వెళ్ళగానే ఒక ఇంటి ముందు ''ఎస్. ఆర్. రావు.. అడ్వొకేట్'' అన్న బోర్డు వుంది.

''ఇదేనండి'' అని చెప్పి ఆ యువకుడు వెళ్ళిపోయాడు.

ఎస్. ఆర్. రావేమిటి? కాస్సేపు నా బుర్ర పని చెయ్యలేదు.

మరుక్షణంలో సీతారామారావుకు ఎస్ ఆర్ రావు షార్ట్ ఫామ్ అన్న విషయం తట్టింది.

ఆ క్షణంలో నేనెంత రిలీఫ్ ఫీలయ్యానో, నా హృదయం ఎంత తేలిక పడిందో చెప్పలేను.

బహుశా మొదటి సారిగా టెన్సింగ్ నార్కే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించినప్పుడు కూడా అంత ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యుండడు.

చివరకు సాధించాను అన్న ఆనందోద్రేకంతో ఎగిసిపడుతున్న హృదయాన్ని కంట్రోల్ చేసే ప్రయత్నం చేస్తూ గేట్ తెరచుకొని మెల్లగా ఆ ఇంట్లో అడుగుపెట్టాను.

ఆ ఇల్లంతా ప్రశాంతంగా వుంది. ఇంట్లో ఎవరైనా ఉన్నారా లేరా? అన్న సందేహం కలిగింది.

ముఖానికి పట్టిన చెమటంతా తుడుచుకుంటూ కొన్ని క్షణాలు గేటు దగ్గరే నిల్చున్నాను.

ఇంతలో ఇంటి ముందు వరండాలోకి ఓ అమ్మాయొచ్చింది. ఆ అమ్మాయిని చూడగానే.

''దట్ మస్ట్‌బి గీత'' అనుకుంటూ హుషారుగా ముందుకు కదిలాను –

ఆ అమ్మాయి అందంగా ఉంది –

నా కేసి ''మీరెవరు?'' అన్నట్టుగా ఆశ్చర్యంగా చూస్తూ ఒక గొప్ప ఆర్టిస్టు చిత్రించిన బొమ్మలా కళాత్మకమైన భంగిమలో నిల్చుంది.

''అయామ్ వికాస్! అండ్ యూ ఆర్ గీత! యామై రైట్?'' అన్నాను. కాన్ఫిడెంట్‌గా ఆమె ముందు నిల్చుని.

నే నన్నమాట ఆమె కర్థమయినట్లు లేదు – ఆమె నన్నింకా అలాగే వింతగా చూస్తూ నిల్చుంది.

''నా పేరు వికాస్! నువ్వు గీతవే కదూ?'' అన్నాను ఈసారి స్వరాన్ని పెంచి.

ఆ అమ్మాయి యేదో కలలోంచి మేల్కొన్నట్టుగా 'గీత ఇంట్లో లేదండి' అంది

తడబడ్తూ.

''మైగాడ్! నువ్వు గీతవు కాదా?'' అన్నాను ఆమె కూర్చోమనకుండానే అక్కడున్న కుర్చీలో అప్రయత్నంగా కూలబడిపోతూ -

''కాదండీ... గీత ఆఫీసు కెళ్ళింది''

''ఈ రోజు ఆదివారం కదా? ఆఫీసేమిటి?''

''గీత పార్ట్‌టైంగా ఓ చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేస్తోంది - ఆ కంపెనీ సోమవారం సెలవు - ఆదివారం ఉంటుంది.''

''ఇంటికెప్పుడొస్తుంది?''

''సాయంకాలం ఐదింటిదాకా రాదు''

''లంఛ్ టైమ్ గదా! ఇప్పుడు రాదా?''

''ఊహూ... టిఫిన్ తీసుకెళ్ళింది''.

''ఆ ఛిట్ ఫండ్ కంపెనీ ఎక్కడుంటుంది?''

''జిన్నా టవర్ దగ్గర... మీరు వెళ్ళండి - చాలా సులభంగా దొరుకుతుంది'' అందా - అమ్మాయి.

''ఎంత దూరం?''

''కొంచెం దూరమే... రిక్షాలో వెళ్ళండి''

''ఆ కంపెనీ పేరేమిటో కాస్త రాసివ్వండి'' అన్నాను కుర్చీలోంచి లేస్తూ.

ఆ మరుక్షణంలో ఆ కంపెనీ దాకా వెళ్ళాలని నిర్ణయించుకున్నాను -

ఆ అమ్మాయి ఒక కాగితం మీద ఆ కంపెనీ పేరు రాసిచ్చింది.

''ఈజీగా దొరుకుతుందా?''

''దొరుకుతుందండి''

''గీత ఆఫీసులో డెఫినిట్‌గా ఉంటుందా?''

''ఐదింటిదాకా ఎక్కడకూ వెళ్ళదు - డెఫినిట్‌గా ఉంటుంది...''

''థ్యాంక్యూ వెరీమచ్'' అంటూ ఆ ఇంటిగేటు వైపు తిరిగాను - నా వెనుక నుంచి ''మంచినీళ్ళు త్రాగుతారాండి?'' అన్న ఆ అమ్మాయి మాటలు వినిపిస్తూనే ఉన్నా ఆమెకేమీ సమాధానం చెప్పకుండానే మళ్ళీ వీధిలో పడ్డాను.''

నా అన్వేషణ ఇంకా అంతం కాలేదు.

ఇంతవరకూ వచ్చాక గీతను కలుసుకోకుండా వెళ్ళిపోవటం నేరమనిపించింది.

ఆ ఆఫీసు దాకా వెళ్ళి గీతను కలుసుకుంటేనే ఇంత అన్వేషణ కేమన్నా అర్థం

పరమార్థం ఉంటాయి - వెళ్ళి తీరాల్సిందే - తప్పదు -

మెయిన్ రోడ్డు దాకా నడిచి అక్కడ చెట్టుకింద విశ్రాంతి తీసుకుంటున్న రిక్షావాళ్ళలో ఒకడ్ని పిలిచాను.

"జిన్నాటవర్ వస్తావా?" అన్నాను.

"కూర్చోండి బాబూ!" అన్నాడతడు -

"ఎంతివ్వమంటావు?"

"రూపాయన్నరివ్వండి"

"అక్కడికెళ్ళాక మళ్ళీ యేమీ తాకట్టు పెట్టవుగా"

"అబ్బే!, అలా ఎందుకు చేస్తానండి? బేరమంటే బేరమే"

అతడి రిక్షా ఎక్కికూర్చున్నాను.

రిక్షా కదిలింది.

ఎదురుగా వస్తున్న మరో రిక్షాలో కూర్చున్న అమ్మాయి మీద నా దృష్టి పడింది.

ఆ అమ్మాయి అచ్చం ఇందాక నేను ఆ అడ్వకేట్ గారింట్లో చూసిన అమ్మాయి లాగే వుంది-

'కొంపదీసి ఈమె గీత కాదుగదా?' అనుకున్నాను- ఆ రిక్షాను ఆపి 'మీ పేరు గీత కదూ?' అని అడుగుదామనుకున్నాను - నేనిలా అనుకుంటుండగానే ఆ రిక్షా నన్ను దాటిపోయింది.

ఇవాళ నా కేదో పిచ్చి పట్టింది. గుంటూరులో కనిపించిన ఆడపిల్ల లందరూ నా కళ్ళకు గీత లాగే కనిపిస్తున్నారు -

గీత డెఫినిట్‌గా ఆఫీసులోనే ఉంటుంది, ఆ అమ్మాయి చెప్పింది - "యేదన్నా అర్జంటుగా అవసరమొచ్చి గీత ఇంటి కొస్తోందో యేమో!, యూ ఆర్ మిస్సింగ్ ది బస్ వన్స్ ఎగైన్... ఆ రిక్షాను ఫాలోకా" అని నా అంతరాత్మ ఘోషించింది.

వెనక్కి తిరిగి చూశాను - ఆ రిక్షా చాలా దూరం వెళ్ళింది - గీత వాళ్ళింటికి వెళ్ళాల్సిన వీధి వైపు మళ్ళలేదు - అనుకున్నాను.

ఇరవై నిముషాల తర్వాత 'జిన్నా టవర్' వచ్చిందన్నాడు, రిక్షావాడు -

వెంటనే రిక్షా దిగి అతనికి రూపాయన్నర ఇచ్చేసి చేతిలో ఉన్న కాగితాన్ని అక్కడు ఓ పెద్ద మనిషి చూపిస్తే 'అదిగో... ఆ కనిపించే యెల్లో బిల్డింగ్‌లోనే ఆ కంపెనీ ఉంటుంది" అన్నాడు -

ఆ బిల్డింగ్ వైపు నడిచాను.

ఈ భూగోళం చివరి అంచుకు వెడ్తున్న యాత్రికుడిలా ఫీలయ్యాను-

ఇక్కడైనా గీత ఉంటుందా? ఆమెనను నిజంగా కలుసుకుంటానా? ఆమెనను సంభ్రమాశ్చర్యాల్లో ముంచేస్తానా?

ఇక్కడ గీత తప్పకుండా ఉంటుంది.

ఉండకపోతే?

నా ఆలోచనే చాలా భయంకరంగా ఉంది.

ఉండకపోతే! ఈ గుండె టప్మని పగిలిపోతుంది.

లేదు... లేదు... అలా జరగదు – గీత తప్పనిసరిగా ఉంటుంది – ఉండక పోవటం అసంభవం. యే పాపమూ చెయ్యని నాకు అంత అన్యాయం జరగడానికి వీల్లేదు.

ఆ బిల్డింగ్ పై అంతస్తులో ఆ ఆఫీసు వుంది.

వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ పై అంతస్తుకు చేరుకున్నాను.

ఆఫీసులో కెళ్ళగానే ఓ టైప్‌రైటర్ ముందు ఓ మధ్య వయస్కురాలు కూర్చొని వుంది. ఆమె కెదురుగా వెళ్ళి –

''ఈ ఆఫీసులో గీత అనే అమ్మాయి పనిచేస్తోంది – ఆమెను నేను కలుసుకోవాలి – కాస్త పిలుస్తారా? అన్నాను. ఆమె నావైపొకసారి ఎగాదిగా చూసి –

''ఈ ఆఫీసులో గీత అనే అమ్మాయి ఎవరూ పనిచెయ్యటం లేదు... మీకెవరు చెప్పారు?'' అందామె.

ఆ క్షణంలో నా సహనం పూర్తిగా నశించింది.

''బట్ దిసీజ్ రిడిక్యులస్! ఇప్పుడు నేను ఆ అమ్మాయింటికెళ్ళివస్తున్నా ఆ అమ్మాయి ఈ ఆఫీసులో వర్క్ చేస్తోందని వాళ్ళ సిస్టర్ చెప్పి నన్నిక్కడకు పంపించారు. ఐ కేమ్ ఆల్ ది వే ఫ్రం వరంగల్ టు గుంటూరు సీ హర్... మీ రా అమ్మాయి ఇక్కడలేదంటారేమిటి?''

అరిచినట్టుగా అన్నాను.

లేదండి... ఈ ఆఫీసులో గీతెవరు లేరు... మిమ్మల్నెవరో...

''యూ ఆర్ సింప్లీ మ్యాడ్! గీత లేపోవటమేమిటి? ఇట్స్ ఇంపాజిబుల్ ఉండి తీరాలి''

ఈసారి ఇంకా గట్టిగా అరిచాను.

నా మాటలు కొంచెం దూరంగా పనిచేస్తున్న మిగతా వాళ్ళకు వినిపించినట్టున్నాయి... ఒకరిద్దరు లేచి నా దగ్గరకొచ్చారు.

''మీరు వికాస్ గారు! ఔనా?''

ఆ మాట ఎవరి నోట్లోంచి వెలువడిందా అని అక్కడ నిల్చున్నవాళ్ళను చూస్తున్నాను.

''నేనే మేష్టారు గీతను!''

''వాడ్డుయూ మీన్?'' అన్నాను. నా కళ్ళను నేను నమ్మలేక.

''అవును మేష్టారూ! గీత పేరుతో నేనే మీకు లెటర్స్ రాశాను...''

''వో!, థీసీజ్ టెర్రిబుల్... రిడిక్యులస్... ఇన్ హ్యూమన్..'' నాలో గొణుక్కుంటూ అక్కణ్ణించి కదిలాను.

అతడు... ఆ కుర్రాడు నా వెనకాలే వస్తూ'' మిమ్మల్ని సర్‌ప్రైజ్ చెయ్యాలని ఇలా చేశాను మేష్టారు... మిమ్మల్ని బాధపడితే క్షమించండి''

దిసీజ్ క్రుయాలిటీ! దిసీజ్ టార్చర్!, ప్లీజ్... ప్లీజ్... డోన్ట్ డూ ఇట్...

''ఎప్పుడొచ్చారు మేష్టారు? నేనిక్కడుంటానని మీ కెవరు చెప్పారు?''

అతనితో మాట్లాడలేక పోతున్నాను – కాని తప్పదు. 'మీ ఇంటి కెళ్ళాను? మీ సిస్టరనుకుంటాను.. నువ్విక్కడుంటావని చెప్పింది'' అన్నాను.

''మీరిదివరకొకసారి వస్తానని రాసినప్పుడు మీ రొచ్చినప్పుడు బై చాన్స్ నేనింట్లో లేకపోతే నా అసలు పేరు సంగీతరావని చెప్పొద్దని దానికి చెప్పాను. మిమ్మల్ని చాలా సర్‌ప్రైజ్ చెయ్యాలని ఎన్నో రోజులు నుంచి ఎదురుచూస్తున్నాను మేష్టారు! అవును... మీ రొస్తున్నట్టు ఉత్తరం రాయలేదేమిటి?''

నే నెందుకు ఉత్తరం రాయలేదో చెప్పే హృదయం అప్పుడిక నాలోలేదు.

చకాచకా మెట్లు దిగాము. ''కొందరు రచయితలు మగ పాఠకుల ఉత్తరాలకు సమాధానాలు రాయరు మేష్టారు. అందుకే నేను ఈ టెక్నిక్‌ను ఫాలో అయ్యాను'' అతడలా ఏదో చెబుతూనే ఉన్నాడు. నేను అతడేం చెబుతున్నాడో వినిపించుకునే స్థితిలో లేను – అతడు చెబుతున్న విషయాల్ని వింటున్నట్టు నటిస్తూ ''ఔను... కాదు... నిజంగానా?'' అని క్లుప్తంగా సమాధానం చెబుతున్నాను.

''మీరూ భోజనం చేశారా మేష్టారు?'' అడిగాడతడు.

''లేదు... బాగా ఆకలేస్తోంది'' అన్నాను.

''ఇక్కడికి దగ్గరల్లోనే సుదర్శన్ అని ఈ ఊళ్లోకల్లా పెద్ద హోటలుంది. వెడదాం పదండి' అన్నాడతడు.

ఆ కుర్రాడు వేగంగా నడుస్తున్నాడు నేనతన్ని అనుసరించాను.

హోటల్ సుదర్శన్‌లో ఎయిర్ కండిషన్డ్ రూమ్‌లో కూర్చున్నాకగాని నేనతని కేసి సూటిగా చూడలేక పోయాను.

ఆ పాతికేళ్ళ కుర్రాడు తెల్లగా, సన్నగా, పొడుగ్గా, అమాయకంగా వున్నాడు. ఇందాక వాళ్ళింట్లో చూసిన ఆ అమ్మాయికి ఇతనికి చాలా పోలికలున్నాయి.

''నేను ఆడపిల్లను కాకపోవటం వల్ల మీరు చాలా బాధపడిపోతున్నారా మేష్టారు?''

''లేదు'' అన్నాను.

''కానీ చాలామంది రచయితలు ఆడపిల్లలు ఉత్తరాలు రాస్తే యెంతో ప్రాధాన్యం ఇచ్చి వెంటనే సమాధానం రాస్తారు... అదే మొగవాళ్ళు రాస్తే అసలు పట్టించుకోరు... ఎందుచేత?''

''నాకు తెలీదు... నేను మాత్రం ఎప్పుడూ అలా చెయ్యలేదు'' అన్నాను.

నేను భోజనం చేశాను. అతడు కాఫీ తాగాడు. నేనెంత వద్దన్నా వినకుండా అతడే బిల్లు చెల్లించాడు.

బయటకు రాగానే ''నేను విజయవాడ కెళ్లిపోతాను'' అన్నాను.

''ఈరోజు మా ఇంట్లో ఉండి వెళ్లండి మేస్టారు...'' అన్నాడతను బతిమాలు తున్నట్లుగా.

''వద్దు.... మరోసారెప్పుడైనా వస్తాను... ఈ సాయంత్రం విజయవాడలో ఒక ఫ్రెండును కలుస్తానని మాటిచ్చాను...'' అన్నాను.

''నేను బస్టాండ్‌దాకా వస్తా పదండి'' అన్నాడతడు.

ఇద్దరమూ రిక్షా ఎక్కాం. అతడు పక్కనే కూర్చున్నాడు. సాహిత్యాన్ని గూర్చి, రచయితల్ని గూర్చి అతడే నాకు చెబుతూనే ఉన్నాడు. కాని నేనతన్ని వినిపించుకోవడం లేదు. నా కళ్ళు గీత కోసం వెతుకుతున్నాయి....

నా అన్వేషణ ఫలించలేదు.

నాకు తెలిసిన గీతను కలుసుకోకుండానే గుంటూరును విడిచి వెళ్లిపోతున్నాను.

బస్‌స్టాండ్ వచ్చేసింది. బస్సు రెడీగా ఉంది. అతడు టికెట్ తెచ్చిచ్చాడు.

కండక్టర్ బెల్ కొట్టాడు.

బస్సు కదిలింది.

''వెళ్ళగానే ఉత్తరం రాయండి మేస్టారు'' అంటున్నాడతడు చెయ్యి ఊపుతూ.

'అలాగే' అన్నాను.

బస్సు వేగాన్ని పుంజుకుంది.

నా మనస్సునిండా ఒక భయంకరమైన వెలితి.

బస్సు కిటికీలోంచి నా కళ్ళింకా వెతుకుతూనే ఉన్నాయి.

గీతను కలుసుకోకుండానే వెళ్లిపోతున్నాను.

నాకు తెలిసిన ఆ గీతను యేనాటికయినా కలుసుకుంటానా?

ఏనాటికయినా నా అన్వేషణ ఫలిస్తుందా? ★

(స్వాతి - జూన్ 1980)